క్లుప్తంగా

దత్తాత్రేయ ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్

భైంసారూరల్: మండలంలోని దేగాం శివారులో దత్తాత్రేయ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ అన్నారు. సోమవారం దత్తాత్రేయ ఆలయంలో పూజలు నిర్వహించారు. నిధుల మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన వెంట పూజారి బాబురావు, నాయకులు శ్యాంరావుపటేల్, శంకర్‌చంద్రే, ముత్యంరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రకాంత్, శరత్ తదితరులు ఉన్నారు.

ఎంజేపీని తనిఖీ చేసిన ఎంపీవో



మెనూను పరిశీలిస్తున్న ఎంపీవో

ఖానాపూర్: పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలను ఎంపీవో రత్నాకర్‌రావు సోమవారం తనిఖీ చేశారు. కళాశాలలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుని సోదరభావంతో కలిసి మెలిసి చదువుకోవాలన్నారు. అనంతరం కళాశాలలోని భోజన మెనూను పరిశీలించారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నర్సాపూర్(జి): వన్యప్రాణులకు హాని కలిగించేలా పంటల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తప్పవని ఎఫ్ఎస్ఓ అలేఖ్య హెచ్చరించారు. నర్సాపూర్ (జి) బీట్ పరిధిలో నర్సాపూర్(జి), రాంపూర్, నసీరాబాద్ గ్రామాల్లో మొక్కజొన్న పంటలను సోమవారం పరిశీలించారు. ఎవరైనా పంటల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే అటవీ వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఎఫ్‌బీఓ సాయరెడ్డి ఉన్నారు.

ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



బ్యాగులు అందజేస్తున్న శ్రీహరిరావు

మామడ: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని కమల్‌కోట్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ ఎస్ఆర్‌డిజిటల్ క్యాంపెయిన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అదనపు తరగతి గది, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు దాదాపు రూ.20 వేల విలువ చేసే బ్యాగులు అందించారు. సంస్థ ప్రతినిధులు విజయ్‌కుమార్ రెడ్డి, నరేశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, కాలగిరి గంగారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వకీల్, జైసింగ్, పడాల శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం మన్మథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి సోమవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవికాలం ముగిసే వరకు బస్‌డిపోలో మజ్జిగ ప్యాకెట్లు అందిస్తామని తెలిపారు. సహాయ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి'



కుభీర్ మండలం రంజనీతండాలో నీటి కుంట పనుల్లో కూలీలు (ఫైల్)

- పనులకు 17 వేల మంది కూలీలు
- ప్రతీ పంచాయతీలో 50 మంది హాజరు

జిల్లాలో..

గ్రామ పంచాయతీలు:	396
జాబ్‌కార్డులు:	1.77 లక్షలు
యాక్టివ్ కార్డులు:	1.33 లక్షలు

లోకేశ్వరం: వలసలు నివారించి ఉన్న ఊరిలోనే నిరుపేద కూలీలకు ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ సత్ఫలితాలిస్తోంది. గ్రామాల్లో వివిధ పనులు చేపడుతుండగా స్థానిక కూలీలకు ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతగా లేని సమయం కావడంతో జిల్లాలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. ఇటీవల కూలి మొత్తాన్ని పెంచడంతో కూలీలు కూడా పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. రోజుకు సగటున 17 వేల మందికి పైగా కూలీలు పనులకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో గ్రామాలకు దూరంగా చేపట్టిన పనుల వద్దకు ట్రాక్టర్లతో కూలీలను తరలిస్తున్నారు. ప్రతీ పంచాయతీ పరిధిలో 50 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూస్తున్నారు. జిల్లాలో జల సంరక్షణ పనులకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఫీడర్ చానెళ్ల ఏర్పాటు, కందకాలు తవ్వడం, ఫాంపండ్, ఫీష్ పాండ్, సాగునీటి కాలువల బాగు చేసేవి చేపడుతున్నారు. వీటితోపాటు పొలాలకు దారి సౌకర్యం కల్పించే పనులు సాగిస్తున్నారు. 2024–25 ఆర్థికసంవత్సరంలో 59.13 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. మార్చిలో 17 వేల మంది కూలీలు వస్తుండటం గమనార్హం. కూలీ రూ.300లకు పెంచగా, ప్రస్తుతం సగటు కూలీ రూ.220 అందుతుందని అధికారులు చెబుతున్నారు.

కూలి చెల్లించాలి



ఉపాధిహామీ పనికి రోజు వెళ్తున్నా. చేసిన పనులకు కూలి డబ్బులను చెల్లించాలి. గతంలో నెలల తరబడి డబ్బులు వచ్చేవి కావు. చేసిన పనులు కొలతను తీసి డబ్బులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కుస్తాపురం భోజన్న, ధర్మోర

అందరికీ పనులు కల్పిస్తాం

కూలీలకు ఉపాధి పని కల్పించడం, జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. జిల్లాలో ప్రతీ గ్రామం నుంచి కూలీల సంఖ్య పెరిగింది. మరింత పెంచేందుకు కృషిచేస్తున్నాం. పనులు జరిగే చోట నీటి, మెడికల్ కిట్లు వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

'ఆశ'లకు ఉద్యోగభద్రత కల్పించాలి



లోకేశ్వరం: ధర్నా చేస్తున్న ఆశలు



కుంటాలలో వినతిపత్రం ఇస్తున్న ఆశలు

లోకేశ్వరం: ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, పీఎఫ్, ఈఎస్ఐతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశ కార్యకర్తల మండల సంఘం అధ్యక్షురాలు ఆయిటి ఆనందకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆశలు ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ మోతీరాం, పీహెచ్‌సీ వైద్యురాలు శైలాజలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందకుమారి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశలకు ఇన్సూరెన్సు కింద రూ.50 లక్షలు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ప్రతి ఏటా 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలన్నారు. ఆశలు శారద, గంగామణి, మమత, రాణి, కమల, స్వప్న, కల్యాణి, సవిత, మంజూల, అనురాధ, అనిత, గోదావరి ఉన్నారు.

కుంటాల: కుంటాలలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్‌కు ఆశలు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షురాలు ఇంద్రమాల ఉన్నారు.

ఖానాపూర్: ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. కమల, స్వప్న, గంగమణి, విజయలక్ష్మి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: తహసీల్దార్ జానకికి ఆశలు వినతిపత్రం అందించారు. ఆశకార్యకర్తలు ఉన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

భైంసాటౌన్: పట్టణంలోని కుమార్‌గల్లీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదంటూ కాలనీకి చెందిన మహిళలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈమేరకు ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. కాలనీలో మూడురోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, మున్సిపల్ బోరు మోటార్ల తీసివేయడంతో నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మున్సిపల్ అధికారులు తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన సప్తాహం

తానూరు: మొగ్లి గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కాళ్యా కీర్తనలో మహారాష్ట్రలోని అవినాష్ మహారాజ్ పాల్గొని ప్రవచనాలు బోధించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు తులసీ మాలలు ధరించారు. అనంతరం ఉట్టి పగులకొట్టి ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాధ్యుడిని శిక్షించాలని రాస్తారోకో



రాస్తారోకో చేపడుతున్న బాలిక బంధువులు

భైంసాటౌన్: పట్టణంలోని పులేనగర్‌కు చెందిన విద్యార్థిని కదం కోమల్ ఆత్మహత్యకు కారణమైన బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని బాలిక తరపు బంధువులు, కుటుంబీకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బస్టాండ్ ప్రధాన రహదారిపై సోమవారం బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభంశుభం తెలియని బాలికను ప్రేమపేరుతో వేధించిన బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్ చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం బాలిక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మూడు గ్రూపులు కాకుండా నాలుగు గ్రూపులుగా చట్టబద్ధత కల్పించి 59 షెడ్యూల్ కులాలకు సామాజిక న్యాయం అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు, నిర్మల్ టౌన్ అధ్యక్షుడు అరుణ్, జిల్లా నాయకులు దశరథ్, భూమేశ్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మామడ: ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నిర్మల్ డివిజన్ అధ్యక్షుడు లింగన్న, కార్యదర్శి నిరంజన్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. మామడ సెక్షన్ పరిధిలో సబ్‌స్టేషన్లలో విధులు నిర్వహించే ఆర్టిజన్ కార్మికులకు స్థానిక ఏఈ అదనపు డ్యూటీలు వేస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. సబ్‌స్టేషన్‌లో ముగ్గురికి తక్కువ కాకుండా ఓఎస్ఎం స్టాఫ్‌తో డ్యూటీ చేయించాల్సి ఉన్నప్పటికి ఆర్టిజన్ కార్మికులకు అదనపు డ్యూటీలను వేస్తూ వేధిస్తున్నారని తెలిపారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్టిజన్‌లు, ఓఎస్ఎంలకు విధులు కేటాయిస్తామని ఏఈ బాలయ్య తెలిపారు. కావాలని ఎవరిపై పని ఒత్తిడి కలిగించలేదన్నారు. రంజిత్, రమేశ్, స్వామి, కరుణాకర్, శివ, మహేందర్,శ్రీనివాస్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా ఎంఈవో ప్రేమ్‌సాగర్ హాజరై మాట్లాడారు. చదువుతోనే విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

నర్సాపూర్(జి): స్థానిక విద్యావనరుల కేంద్రంలో నూతన ఎంఈవోగా సాయన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన నోడల్ అధికారిగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన సాయన్నను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు కస్తూరి శంకర్, పురుషోత్తం, గురుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌పై దాడి

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



గాయపడిన అబ్దుల్ వకీల్

తానూరు: తానూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ వకీల్‌పై సోమవారం మధ్యాహ్నం బోరిగాం గ్రామ సమీపంలో దాడి జరిగింది. ఆరుగురు యువకులు అకారణంగా దాడిచేసినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తెలిపారు. అబ్దుల్ వకీల్ మధ్యాహ్నం భైంసా నుంచి తానూరుకు దస్తావేజులు తీసుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆరుగురు యువకుల బెల్‌తరోడా నుంచి వెంబడించారు. బోరిగాం సమీపంలో అడ్డుకుని కర్రలు, రాళ్లతో దాడిచేశారు. రోడ్డు వెంట వెళ్తున్నవారు గమనించడంతో వదిలేసి పారిపోయారు. బాధితుడిని భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడి సమాచారం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. అకారణంగా దాడి చేసిన వారి వివరాలు సేకరించారు. నలుగురిని అదుపులో తీసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

భైంసాటౌన్: తానూరు మండలం బోరిగాం వద్ద ప్రభుత్వ ఉద్యోగిపై కొందరు యువకులు దాడి చేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పుకార్లు, వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ప్రభుత్వ ఉద్యోగిపై దాడి సరికాదు'

విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై కొందరు యువకులు దాడి చేయడం సరికాదని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు అన్నారు. ఈ మేరకు దాడిని ఖండిస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మెస్రం బాబరావ్, పుష్ప, నాంపల్లి శ్రీనివాస్, వెంకటరమణ, కృష్ణాగౌడ్, భూక్యా మోహన్, డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు చారిత్రాత్మకం

నిర్మల్‌చైన్‌గేట్: శాసనసభలో సోమవారం ప్రవేశపెట్టిన బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు చారిత్రాత్మకమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టె శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో బిల్లు ఆమోదించడం హర్షనీయమని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లు ఆమోదించాలని కోరారు. బీసీల న్యాయం చేసిన రేవంత్‌రెడ్డి సర్కారుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నవగ్రహాల మంటపం పునర్నిర్మాణ పనులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో హనుమాన్ దేవాలయంలో నవగ్రహాల మంటపం పునర్నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, నిమ్మగడ్డ నాగరాజు శర్మ, శరత్ చంద్ర శర్మల ఆధ్వర్యంలో స్థానిక కాలనీవాసులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐకేపీ వీవో, వీవోఏలకు మానవ అక్రమ రవాణాపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై లింబాద్రి.. మహిళా చట్టాల గురించి వివరించారు. గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నిరక్షరాసులైన మహిళలను మభ్యపెట్టి పట్టణాలకు తరలించే ప్రమాదం ఉందని, అలాంటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. సఖీ సెంటర్ నిర్వాహకురాలు శ్వేతారాణి, మహిళా సాధికారత అధికారులు మౌనిక, జ్యోతి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అడ్డిగ బోసు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

ముధోల్: కారేగాం గ్రామంలో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపాటిల్, డైరెక్టర్ రామనాథ్ నాయక్, ఎస్ఎస్‌యూ మండల అధ్యక్షుడు శశికుమార్ ఉన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

లక్ష్మణచాంద: మండలంలో 15వ విడత సామాజిక తనిఖీ గ్రామసభలు సోమవారం నుంచి మొదలయ్యాయి. వడ్యాల్‌లో ఎంపీడీవో రాధ, పీచరలో ప్రత్యేకాధికారి ఇరిగేషన్ ఏఈ మధుకర్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. 2023–24 సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలను అధికారులు గ్రామస్తులకు వివరించారు. ఏపీవో ప్రమీల, ఏఈ మధుకర్, కార్యదర్శులు, టీఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

మామడ: మండలంలోని కమల్‌కోట్ మాజీ సర్పంచ్ పత్రి ఎర్రన్న, పరిమండల్‌కు చెందిన శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సోమవారం కలిసి పరామర్శించారు.

నేటి నుంచి వారసంత

కుంటాల: లింబా(కె) గ్రామంలో మంగళవారం నుంచి వారసంత ప్రారంభిస్తున్నట్లు వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, వినియోగదారులు విజయవంతం చేయాలని కోరారు.

పది పరీక్షలపై అవగాహన

తానూరు: మండలంలోని ఎల్వి జెడ్పీ పాఠశాలలో పది పరీక్షలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్ష సమయంలో ఆందోళన వద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని మోటివేషనల్ స్పీకర్ తిరునగరి శ్రీహరి తెలిపారు. ఎంఈవో నరేందర్, మోటివేషనల్ స్పీకర్లు వాడేకర్ లక్ష్మణ్, అనిల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

సీసీ ప్లాట్‌ఫాం పనులు ప్రారంభం

ఖానాపూర్: రాజూరా గ్రామంలోని మార్కండేయ ఆలయ ఆవరణలో సీసీ ప్లాట్‌ఫాం పనులను సోమవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గడ్డం రవీందర్, చిన్నం రవి, రాజు, శెట్టి సంజీవ్, కంఠం నారాయణ, ఏపీవో రమేశ్, ఎఫ్ఏ అశోక్ ఉన్నారు.

లైసెన్స్ కలిగి ఉండాలి

ఖానాపూర్: పట్టణ పరిధిలోని వర్తక, వాణిజ్య వ్యాపారులంతా విధిగా మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఈ నెల 31లోగా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, లేకపోతే ఏప్రిల్ 1 నుంచి 25 శాతం అదనంగా జరిమానా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు శుభవార్త

కుంటాల: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2020లో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి రెగ్యులరైజేషన్ చేసుకునే అవకాశం కల్పించిందని ఎంపీవో ఎంఏ రహీంఖాన్ పేర్కొన్నారు. సోమవారం కుంటాల పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుదారుల ప్లాట్లను క్రమబద్ధీకరణ చేశారు. ఈనెల 31 నాటికి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించిందని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం నిర్మల్ టౌన్ సెక్రటరీ తొడసం శంబు అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వైఎస్సార్ కాలనీలో సోమవారం ప్రజాసర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా కాలనీవాసుల ప్రధాన సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లవచ్చన్నారు.

బదిలీపై వెళ్లిన ఆర్ఐకి సన్మానం

లోకేశ్వరం: తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేసిన బాలకిషన్ ముధోల్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. సోమవారం ఆయన్ను తహసీల్దార్ మోతీరాం సన్మానించారు. కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'రాజీవ్‌యువ వికాసం' సద్వినియోగం చేసుకోవాలి

కడెం: రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏప్రిల్ 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కఠినంగా శిక్షించాలి

కడెం: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన ఎన్ఆర్ఐ రవిని కఠినంగా శిక్షించాలని యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. నాయకులు తరి గంగాధర్, సాయికుమార్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4.4లక్షలతో సోమవారం రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ ఇన్‌చార్జి నారాయణ్‌రావు పటేల్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్కలకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ సునీత పోశెట్టి, మాజీ సర్పంచ్ రావుల పోశెట్టి, మాజీ సర్పంచ్ అశోక్, మోహన్, నాగన్న, భూమన్న, గంగాధర్, హన్మాండ్లు, రాజన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

ఖానాపూర్: ఖానాపూర్ కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుత పదవీకాలం ముగియడంతో బార్ కౌన్సిల్ 2025–26 సంవత్సరానికి ఎన్నికల నిర్వహణ కోసం షెడ్యూల్ విడుదల కాగా, బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం మట్టేరి రాజశేఖర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏజీపీ ఆసీఫ్‌అలీ, న్యాయవాదులు సురేశ్, వెంకట్ మహేంద్ర, శివ, వెంకటేశ్, కమలాకర్, కిశోర్‌నాయక్, ఖదీర్ ఉన్నారు.